## జూన్ 4 వరకు మండలమంతా 144 సెక్షన్

**బిట్రగుంట, మే 16 ప్రభాతవార్త** రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం పలు చోట్ల జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో బోగోలు మండలంలో కూడా ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేది వరకు 144 సెక్షన్ అమలులో వుంటుందని బిట్రగుంట పోలీసులు తెలిపారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు వుంటాయని వారు హెచ్చరించారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

**వెంకటాచలం మే 16 ప్రభాతవార్త** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని డిగ్రీ రెండోవ సెమిస్టర్ పరీక్షలను గురువారం ప్రారంభించారు పరీక్షలకు మెత్తం 8958 మంది విద్యార్థులు గాను 8145 మంది విద్యార్థులు హాజరు కాగా 813 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.ప్రతి పరీక్ష కేంద్రములో ప్రభుత్వ నిర్దేశించిన ప్రకారం కోవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ విద్యార్థులను పరీక్ష కేంద్రములోకి అనుమతించారు.ప్రతి ఒక్కరికి మాస్కులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.బౌతిక దూరం పాటిస్తూ పరీక్షలు నిర్వహించడం జరిగిందని పరీక్షల నియంత్రణదికారి మదుమతి తెలిపారు.

## ఆర్టీసి బస్సు, మినీలారీ ఢీ ప్రయాణికులకు స్వల్పగాయాలు



**బుచ్చి మే 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రాఘవరెడ్డినగర్ కాలనీ వద్ద ఆర్టీసి బస్సు,చేపలు రవాణా చేస్తున్న వాహనాం ఢీకొనడంతో ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. పామూరు నుండి నెల్లూరు వైపు వెళుతున్న ఆర్టీసి బస్సును సంఘం వైపు చేపలు తీసుకొని వెళుతున్న లారీ ఢీకొనడంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. గాయాలైనవారందరిని బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బుచ్చిలో జోరు వర్షం



**బుచ్చి మే 16 ప్రభాతవార్త** వేసవి తాపంతో అల్లాడిపోతున్న ప్రజలకు గురువారం కొంత ఊరట లభించింది. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో మద్యహ్నం జోరు వర్షం కురిసింది. చల్లటి గాలులు వీయగా ప్రజలు సేద తీరారు.నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో ఈ వర్షాలు కురిసాయని తెలుస్తోంది . ఈ వర్షాలు ప్రస్తుతం నార్లు పోసుకుంటున్న రైతులకు మేలు చేకూరుస్తుందని చెప్పవచ్చు.

## కావ్య బావ వెంకటేశ్వరరెడ్డి ఉత్తరక్రియల్లో పాల్గొన్న మాలేపాటి



కావలి, మే 16 ప్రభాతవార్త కావలి పట్టణ 13వ వార్డులో నివసిస్తున్న కావలి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి బావ ముంగమూరి వెంకటేశ్వర్లరెడ్డి ఉత్తరక్రియల్లో గురువారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు,కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్నారు. వెంకటేశ్వర్లరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## జాతీయ రహదారిపై లారీ బోల్తా



వెంకటాచలం మే 16 ప్రభాతవార్త జాతీయ రహదారిపై లారీ బోల్తా పడిన సంఘటన మండల పరిదిలోని కాకుటూరు సమీపంలో కియా మోటర్ కారు షోరూం వద్ద చోటుచేసుకుంది. సడన్ బ్రకే వేయడంతో అదుపు తప్పి లారీ బోల్తా పడినట్లు స్థానికులు,వాహనదారులు తెలిపారు.లారీ డ్రైవర్‌కి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్ట్రాంగ్ రూంల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణన్





**నెల్లూరు అర్బన్, మే 16, ప్రభాతవార్త** ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం అప్రమత్తంగా వుంటూ విధులు నిర్వహించాలని సిబ్బందికి కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. గురువారం నెల్లూరు రూల్ మండల పరిధిలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటు చేసిన రిజిష్టరులో సంతకం చేసిన కలెక్టర్, పోలీసు అధికారులతో కలిసి స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీని పరిశీలించారు. ఈ గ్యాలరీలో రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు కౌంటింగ్ ప్రక్రియను వీక్షించేందుకు సిసి, టీవీలను ఏర్పాటు చేశారు. అలాగే 8 నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను మానిటరింగ్ చేసేందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బందితో ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు




**నెల్లూరు రూరల్, మే 16, ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వేదగరి లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు అంకురార్పణలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నెల్లూరు రూరల్, నరసింహా కొండ పై వెలసి వున్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితుల శాస్త్రోక్తంగా మొదటి రోజు ఆరంభించారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం నందు గురువారం నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రధాన అర్చకులు శ్రీ భాస్కరా చార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంకురార్పణతో వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా పుట్ట మన్ను తీసుకుని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా దువ్వూరు నరసింహులు బ్రదర్స్ వ్యవహరించగా కార్యనిర్వహణాధికారి వి. గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. మీనాక్షి నృత్యలయ ఆర్ట్స్ వారిచే సత్య హరిశ్చంద్ర కాటి సీను భక్తులను అలరించాయి. ప్రకృతి సౌందర్యం, విద్యుత్ కాంతుల నడుమ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దర్శనమిస్తుంది.



## డబ్బులు చెక్‌పోస్టులు ఎలా దాటాయి..?




**మనుబోలు, మే 16, ప్రభాతవార్త** 2024 అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో డబ్బు అగ్ర స్థానంలో నిలిచింది. ప్రధాన పార్టీ అభ్యర్థులకు ఈసారి ఎన్నికలు భారీ ఎత్తున ఖర్చు చేయాల్సి వచ్చింది. గతంలో 2019 ఎన్నికలకు, 2024 ఎన్నికలకు రెండితల ఖర్చు పెరిగింది. అప్పుడు రూ.20,నుంచి రూ.30కోట్లతో ఎన్నికలకు ఖర్చు చేయగా ఇప్పుడు రూ.50 నుంచి రూ.100 కోట్లు దాటిందని చెప్తున్నారు. నెల్లూరు జిల్లాలోని 8 అసెంబ్లీ స్థానాల్లో కోవూరు, నెల్లూరు సిటీ భాగా నేతలు డబ్బులు యధేచ్ఛగా ఖర్చు పెట్టినట్లు సమాచారం. ఈసీ డబ్బును నియంత్రించేందుకు పెట్టిన చెక్‌పోస్టులు దాటి నియోజకవర్గాలకు ఎలా వచ్చిందనేది చిక్కు ప్రశ్న. జిల్లా బార్డర్, రాష్ట్ర సరిహద్దులు, నియోజకవర్గ సరిహద్దుల్లో కూడా చెక్‌పోస్టులు పెట్టి ఎన్నికల కమీషన్ పోలీసులు గట్టి తనిఖీలు నిర్వహించారు. అయినప్పటికి ఎన్నికల ముందు రోజు యదేచ్ఛగా డబ్బులు ఓటర్లకు చేరింది. వందల కోట్ల డబ్బు చెక్‌పోస్టులు దాటి ఓటర్లకు చేర్చడంలో రాజకీయ నాయకులు తమ తెలివితేటలు ఉపయోగించారు. ఎన్నికల కోడ్ రాకముందే ముందుగానే డబ్బులను తమ అనుచరుల ఇళ్లల్లో నగదు భద్రపరిచారని సమాచారం. అయితే ఈసారి ఎన్నికల్లో మద్యం పంపిణీ చాలా వరకు తగ్గిందనే చెప్పవచ్చు. పలు చెక్‌పోస్టుల్లో మద్యం సీసాలు సీజ్ చేయడం జరిగింది. దీంతో భయపడ్డ అభ్యర్థులు మద్యం పంపిణీపై ఆసక్తి చూపలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాలు కూడా ఒకటిన్నర లక్ష టార్గెట్ పెట్టి సాయంత్రం కల్లా షాపులు మూసివేయడంతో మద్యం ఎన్నికల ప్రచారంలో పెద్దగా కనిపించలేదు. 2019 ఎన్నికల్లో మద్యం కీలకపాత్ర పోషించింది. 2024 ఎన్నికల్లో మద్యం ఇంచుమించు పూర్తిగా ప్రచారంలో నిషేధానికి గురైనట్లు సమాచారం. ఎన్నికలు సజావుగా సాగడంలో ఘర్షణలు తగ్గడంలో మద్యం నియంత్రణ చాలా భాగా ఉపయోగపడిందని పలువురు అంటున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని మనుబోలు మండలంలో కాగితాలపూరు, కొమ్మలపూడిలో చిన్న తగాదాలు మాత్రమే జరి గి, వీటిని ఎస్పై అజయ్‌కుమార్ నియంత్రించగలిగారు. మడ మనూరు, వీరంపల్లి ఫ్యాక్షన్ గ్రామాల్లో సైతం ప్రశాంతంగా ఎన్నికలు జరగడం విశేషం. త్వరలో వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్ కోసం ప్రధాన పార్టీ అభ్యర్థులు, వారి అనుచరులు ఎదురు చూస్తున్నారు.





## పిడుగులు పడి 8జీవాలు మృతి



**అనుమసముద్రంపేట,మే16,ప్రభాతవార్త** : ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం పొలాల్లో పిడుగులు పడి 8జీవాలు మృతిచెందాయని జీవాల యజమానులు తెలిపారు. గురువారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఉరుములతోకూడిన భారీ వర్షం కురిసింది. రాజవోలు, గుడిపాడు, చౌటభీమవరం , దూబగుంట తదితర గ్రామాల్లో భారీ వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. పొలాల్లోకి వెళ్ళిన జీవాలు మేస్తుండగా అకస్మాత్తుగా అకాల వర్షం మొదలైంది. దాంతో జీవాలు ఆ ప్రాంతంలోని పెద్ద మర్రిచెట్టుకిందకు వెళ్ళాయి . జీవాల కాపరులు మాత్రం సమీపంలోని వేపచెట్టుకిందకు వెళ్ళారు. భారీగా మెరుపులు, ఉరుములు భయాందోళన కలిగించాయి. ఈసందర భంగా మర్రిచెట్టుపై పిడుగు పడడంతో అక్కడున్న జీవాలు కొన్ని పారి పోగా కొన్ని అక్కడికక్కడే మృతిచెందాయని వాటి యజమానులు వాపోయారు. ఆరు మేకలు, రెండు గొర్రెలు పిడుగుపాటుకు మృతిచెందాయని తెలిపారు. గ్రామంలోని దుర్గంపాటి కృష్ణయ్య కు చెందిన మూ డు గొర్రెలు, చిన్నయ్యకు చెందిన రెండు గొర్రెలు, మేకల హాజరత్తయ్యకు చెందిన రెండు మేకలు, కోల మూరి హాజరత్తయ్యకు చెందిన ఒక గొర్రె పిడుగుపాటుకు మృతిచెందాయని గ్రామ సర్పంచ్ లక్ష్మీన రసయ్య తెలిపారు. జీవాలతోపాటు ఆచెట్టుకిందకే కాపర్లు కూడా వెళ్ళి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండే దన్నారు. ఈ ప్రమాంలో సుమారు లక్షరూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం నష్టపోయిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సర్పంచ్ లక్ష్మీనరసయ్య , గ్రామ నాయకులు, బాధితులు కోరారు.

## కావలి క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందో !

### లెక్కల అంచనాలలో తలమునకలైన నేతలు !!

### గెలుపు ధీమాలో ఎవరికి వారే !!!

కావలి, మే 16 ప్రభాతవార్త ఈ నెల 13వ తేది జరిగిన కావలి నియోజకవర్గ ఎన్నికలలో క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందో, ఎవరికి లబ్ది చేకూరుతుందో అనే దానిపై నేతలు తలలుపీక్కుంటూ గందరగోళంలో వున్నారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా చక్రం తిప్పి వైసిపి పార్టీలో సస్పెన్షన్‌కు గురై వైసిపి పెద్దల పుణ్యమా అంటూ మంల వైసిపిలో చేరిన మన్నెమాల సుకుమార్‌రెడ్డి ముగ్గురు ప్రస్తుతం ఈ ఎన్నికలలో ఎమ్మెల్యేకు మద్దతు ఇచ్చారు. అయితే ఈ ముగ్గురు నేతలు జగన్ తర్వాత ప్రధాన భూమిక పోషిస్తున్న విజయసాయిరెడ్డి నెల్లూరు వైసిపి ఎంపిగా బరిలో దిగారు. విజయసాయిరెడ్డికి దగ్గరవడంతో పాటు ఆయన ఆశీస్సులు, అండదండల కోసం పరితపించిన ఈ ముగ్గురు నేతలు దాదాపుగా విజయసాయిరెడ్డి గెలుపుకే పనిచేశారని రాజకీయ విశ్లేషకులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్న తపనలో లేరని కూడా విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఈ ముగ్గురు నేతలు వారివారి స్థాయిలలో ఓట్లు అడిగిన వారిలో ఎమ్మెల్యేకి ఓటు వేసేది లేదని చెప్పడంతో విజయసాయిరెడ్డికి ఓటు వేయమని ప్రాధేయపడినట్లు కూడా ప్రచారం సాగుతోంది. ఇదిలావుంటే వైసిపిలోని కొంతమంది రెడ్లు టిడిపి ఎంపి అభ్యర్ది వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి క్రాస్ ఓటింగ్‌కి పాల్పడినట్లు కూడా ప్రచారం వుంది. ముస్లిం కమ్యూనిటీ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్దికి ఓట్లు వేయమని అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసినట్లు కూడా ప్రచారం. పోలింగ్ బూత్‌లలో ఎంపి ఓటు, ఎమ్మెల్యేకి వేయాల్సిన ఓటు అని అక్కడ పోలింగ్ అదికారులు చెప్పకపోవడంతో క్రాస్ ఓటింగ్‌కు అవకాశం ఏర్పడింది. ఎంపి, ఎమ్మెల్యే ఒకే నెంబరు వున్న వాటిపై వేయాలనుకునే వారికి ఎటువంటి సమస్య తలెత్తలేదు.

ఎంపి అభ్యర్ధికి క్రాస్ ఓటింగ్ చే యాలన్న తలంపుతో వున్న ఓటర్లు మాత్రం చాలాచోట్ల తికమక పడినట్లు తెలుస్తోంది. స్వతంత్ర అభ్యర్థికి సంబంధించి ఆయనకు వేసే ఓటర్లు ఒక రు వైసిపికి, ఒకరు టిడిపికి ఓట్లు వేసినట్లు కూ డా తెలుస్తోంది. ఈవియం బాక్సులు ఏ అభ్యర్దికి సంబంధించినవి అని పోలింగ్ అధికారులు చెప్పకపోవడంతో చాలా మంది ఓటర్లు తికమకపడ్డారు. ఫలితంగా ఆ ఓట్లలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి ఎవరి కొంప ముంచుతుందో అన్న సందిగ్దంలో కూడా నేతలు వున్నారు. ఇవన్ని ఒక ఎత్తయితే వైసిపి, టిడిపి అభ్యర్దులు గెలుపు తమదేనంటూ పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్లను విశ్లేషించుకుంటూ ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కావలి అర్బన్, రూంల్, అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాలలో ఎవరికి మెజార్టీ వస్తుందో అన్న లెక్కలు వేయడంలో నేతలు నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికలలో ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి, ఈ పార్టీ నుంచి ఆ పార్టీకి జంప్ జిలాని చేసిన నాయకులు, కార్యకర్తలు క్రాస్ ఓటింగ్ చేయడంలో ఏ ఎంపి అభ్యర్ది ఖాతాలో చేరుతాయో అన్న వాటిపై కూడా విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

కొన్ని చోట్ల ఎంపికి వేయాల్సి న ఓ టు ఎమ్మెల్యేకు వేయడం బయటకు వచ్చి అరే పొరపాటు జరిగింది అన్న ఓటర్లు కూడా లేకపోలేదు. క్రాస్ ఓటింగ్ చేయాలని భావించిన ఓటర్లు అనుకున్న ఎంపి అభ్యర్దికి పడలేదన్న వాదన కూడా వినిపిస్తుంది. 4వ తేది బాక్కులు తెరిస్తే తప్ప ఈ క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప ముంచిందో తెలుస్తుంది. అయితే టిడిపి, వైసిపి పార్టీలకు చెందిన ఓటర్లు, నాయకులు ఆ పార్టీలకు వేయాలని అనుకున్నప్పుడు క్రాస్ ఓటింగ్ తికమక వుండదన్న భావనను కూడా వ్యక్తం చేస్తున్నారు. టిడిపి పార్టీ కోసం పని చేసిన కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణు గోపాలరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్రలు మాత్రం టిడిపి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్దులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## 23వ వార్డు ప్రజలకు పేరుపేరున ధన్యవాదాలు

**కావలి రూరల్, మే 16 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గ ఎన్డీఎ కూటమి టిడిపి అభ్యర్థి దగుమాటి వెంకట కృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) రానున్న ఎన్నికల ఫలితాలలో గెలుపు ఖాయమని కావలి 23వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. గురువారం కావ్య కృష్ణారెడ్డిని కలిసి దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వార్డు టిడిపి నాయకులు ఆలా శ్రీను, అంబటి కిషోర్, అప్పల కళ్యాణచక్రవర్తి, సిసికెఆర్, గోసు రవి, లెక్కల రమేష్, అళహరి సందీప్, లెక్కల మధు, శ్రీదేవి, సోమిశెట్టి బ్రహ్మయ్య, వాలంటీర్లు మాట్లాడారు. కావ్య 20 వేల మెజార్టీతో గెలుస్తారని ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గంలో, రాష్ట్రంలో అఖండ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. దీనికి నిదర్శనం ఎన్నికల రోజు జరిగిన పోలింగ్ శాతమేనన్నారు. కావ్య కృష్ణారెడ్డికి ఓటు వేసిన 23వ వార్డు ప్రజలకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.



## ప్రజా సేవకుడు కిన్నెర

**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త – వైద్యం :** నిత్య కృషీవలుడు, ప్రజా సేవకుడు కిన్నెర పార్ధసారధి అని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి, నగర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ కొనియాడారు. గురువారం నగరంలో కిన్నెర పార్ధసారథి 4వ వర్ధంతి కార్యక్రమాలను ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ముందుగా కిన్నెర చిత్రపటానికి నారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నారాయణ వారి కుటుంబంతో కలిసి కొద్ది సేపు మాట్లాడారు. పార్ధసారధి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సోదరులు కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేయడంతో పాటు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ కరోనా సమయంలో కిన్నెర పార్ధసారధి మరణించడం బాధాకరమన్నారు. ఆయన నిత్యం ప్రజలకు ఎన్నో సేవలు చేసేవారని కొనియాడారు. అదే విధంగా ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతీ ఏడాది నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఆయనతో పాటు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## డెంగ్యూ అవగాహన ర్యాలీ



**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త – వైద్యం :** జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మలేరియా నివారణశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి గుప్తా పార్కు సమీపంలో ఉన్న బీఈడీ కళాశాల వరకు డెంగ్యూ వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అదే విధంగా ఇండ్లలో తొట్లలో, పూల కుండీల్లో పరిసర ప్రాంతాల్లో గుంటల్లో, నీటిని నిల్వ ఉంచరాదన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల డెంగ్యూ దోమ లార్వాలు ఉత్పత్తి అవుతాయన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. తద్వారా దోమ కాటు బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య, మలేరియా నివారణ అధికారిణి డా. హుసేనమ్మ, డెమో బి. శ్రీనివాసరావు, జిల్లా పిహెచ్‌పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, జిల్లా పీహెచ్‌పీ నాయకులు జి. శేషయ్య, డి. శ్రీనివాసులు, ఎన్. మాలిని, ఎన్. ప్రసాద్, యు.రామదాసు, వీ. వీరయ్య, పిహెచ్‌పీ సభ్యులు, ఆశా వర్కర్స్, ఏఎన్ఎంలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రోగ నిరోధక శక్తిని పెంచేందుకు పెద్దలకు కూడా బీసీజీ వ్యాక్సినేషన్

**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** 60 సంవత్సరాలు దాటిన వారిలో రోగ నిరోధక శక్తిని మరింత పెంచేందుకే బీసీజీ వ్యాక్సినేషన్ వేయడం జరిగిందని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరులోని మందబయలు సెంటర్‌లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మాట్లాడుతూ ప్రధానంగా ఈ బీసీజీ వ్యాక్సినేషన్ ఇప్పటివరకు చిన్న పిల్లలకు మాత్రమే వేయడం జరిగిందని, వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కూడా ఈ వ్యాక్సినేషన్ వేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దిలీప్, రామ్మోహన్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



## బిసిజి వాక్సినేషన్ ప్రారంభించిన రమాదేవి

**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త – వైద్యం :** జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. పెంచలయ్య, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే ఖాదరవల్లి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా పెద్దలకు కూడా బీసీజీ వ్యాక్సినేషన్ వేసి కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మోడల్ ఆఫీసర్ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. పెంచలయ్యలు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో టీబీ వచ్చిన వారికి, టీబీ వ్యాధి యొక్క కాంటాక్ట్స్, మధుమేహ వ్యాధి గ్రస్తులు, ధూమపానం చేసేవారికి, 60 ఏళ్ల పై బడిన వారందరికీ, బాడీ మాస్ ఇండెక్స్ 18 కేజీ కంటే తక్కువ ఉన్నవారికి వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. ఈ అడల్ట్ బిసిజీ వ్యాక్సినేషన్‌ని మూడు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.



## విద్యుత్ నిలుపుదల

**నెల్లూరు, మే 16, ప్రభాతవార్త – వైద్యం :** నగరంలోని 33/11 కేవి తెలుగుగంగ సబ్ స్టేషన్‌లోని 11కెవి సంబయ్ గాంధీ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎస్‌బిఐ కాలనీ, జడ్పి కాలనీ, ఇందిరా గాంధీ నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 6 నుండి ఉదయం 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏ సోమశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## జాతీయ డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ

**సంగం మే 16 ప్రభాతవార్త :** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సంగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. డెంగ్యూ వ్యాధి గురించి అవగాహన మరియు నివారణ చర్యల గురించి పిహెచ్‌సి వద్ద ర్యాలీ నిర్వహించారు.పలు చోట్ల దోమల బారి నుండి ఎలా రక్షించుకోవాలో తెలియపరిచారు. అకస్మికంగా వచ్చే ఎముకల కండరాల నొప్పులు తీవ్ర జ్వరం ఈ డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఈవ్యాధి డెంగ్యూ దోమ కుట్టిందున వస్తుంది.ఈ దోమలు పగటిపూటి మాత్రమే కనిపిస్తాయని డాక్టర్లు తెలిపారు. ఇంటి ఆవరణంలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని అన్నారుజ ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి,డాక్టర్ అశోక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



## గ్రంధాలయంలో పరుగు పందాలు

**ఉలవపాడు, మే 16, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలంలో స్థానిక గ్రంధాలయంలో గురువారం విద్యార్థినీ, విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా నీతి కథలు, విజ్ఞానాని అందించే పుస్తకాలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివించి పిల్లల మానసిక ఆనందం కోసం 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించామని ఉలవపాడు శాఖ గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి 14 మంది పిల్లలు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

## మర్రిపాడులో జాతీయ డెంగ్యూ దినోత్సవ వేడుకలు

**మర్రిపాడు, మే16, ప్రభాతవార్త :** మండలంలోని మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో డాక్టర్ గోపినాథ్ , డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగ్యూ నివారణా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ పగటిపూట కుట్టే దోమ వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని , పగటిపూటదోమ కుట్టకుండా ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని ,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని , మురికినీరు అధికంగా ఉన్న చోట లార్వా అధిక మోతాదులో నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి అధికమై డెంగ్యూ కి కారణమవుతుందన్నారు. గ్రామాల ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని గోపినాథ్ తెలిపారు. గ్రామాల్లో క్షయవ్యాధి పట్ల ప్రనజలు అవగాహన కలిగిఉండాలని ఆరోగ్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి డెంగ్యూవ్యాధిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్షయవాధి నివారణకు వయోజనులకు బిసిజి టీకాలు

**రాపూరు, మే16 ప్రభాతవార్త :** క్షయ వ్యాధి నివారణకు 18 సంవత్సరాలు నిండిన వారందరికి బిసిజీ టికాలు వేసే కార్యక్రమాన్ని గురువారం రాపూరు ఏరియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.వి.సుదర్శనమ్మ ప్రారంబించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు వేసే బిసిజి టీకాల ప్రభావం 18 సంవత్సరాల వరకు మాత్రమే వుంటుందన్నారు. దీంతో కోత్తగా క్షయవ్యాది నివారణకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఈ టికాలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో ముందుగా గతంలో టిబి వచ్చిన వారికి,డయాబిటీస్ వ్యాధి గ్రస్తులకు ముందుగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. యంపిహెచ్ఇఒ అబ్దుల్ సల్మాన్,టిబి సూపర్‌వైజర్ సిహెచ్ శ్రీనివాసుల రెడ్డి, ఆరోగ్య కార్యకర్త కాంతమ్మ, హరిత, అశా తదితరులున్నారు.



## రోడ్డు ప్రమాదంలో హోమ్‌గార్డు వెంకట్రావుకు తీవ్ర గాయాలు

**కావలి, మే 16 ప్రభాతవార్త :** కావలి పట్టణ విశ్వోదయ పాఠశాల సమీపంలో రెండు మోటార్‌సైకిళ్ళు ఢీకొన్న సంఘటనలో కావలి వన్‌టౌన్ సిఐ జీపు డ్రైవర్ హోమ్‌గార్డు వెంకట్రావు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలావున్నాయి. కావలి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకట్రావు మోటార్‌బైక్‌పై ఫ్లైవోవర్ దిగుతుండగా ఎదురుగా మరో మోటార్‌సైకిలిస్ట్ ఢీకొ నడంతో వెంకట్రావు తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 వాహనంలో ఆయనను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకట్రావును నెల్లూరుకు తరలించారు.



## బ్యాంక్ ద్వారా బీమా అందజేత

**అల్లూరు, మే 16 ప్రభాతవార్త :** అల్లూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నందు గురువారం సున్నపుబట్టి ప్రాంతానికి చెందిన బొట్టా విజయ్‌కుమార్ ఆకస్మిక మరణంతో ఆయన భార్య బొట్టా మస్తానమ్మకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద బీమా మొత్తాన్ని బ్యాంక్ మేనేజర్ కృష్ణ కుమార్, సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో అకౌంట్ వున్న వారు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద సంవత్సరానికి 436 రూపాయలు చెల్లిస్తే వారికి 2 లక్షల రూపాయిలు బీమా వుంటుందని తెలిపారు. సున్నపుబట్టి ప్రాంతానికి చెందిన బొట్టా విజయ్‌కుమార్‌కి మా బ్యాంక్ అకౌంట్ వుండటంతో ఆయన మరణించగా రెండు లక్షల రూపాయలు బీమా మొత్తాన్ని ఆయన భార్య మస్తానమ్మకు నగదు రూపంలో అందజేయడం జరిగిందని తెలిపారు. మా బ్యాంకులో అకౌంట్ వున్న వారుప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ప్రసన్న, మహేష్, ఆనంద్, ప్రశాంతి, నవీన్, సాల్మన్‌రాజులు పాల్గొన్నారు.



## ఈనెల 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**ఉలవపాడు, మే 16, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీన ఎంపీపీ వాయిల మస్తానమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్.విజయ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని తెలియజేశారు. ఈ సమావేశానికి విచ్చేసే సంబంధిత అధికారులు ఆయా శాఖల సమగ్ర నివేదికతో హాజరు కావాలని ఆమె సూచించారు.

## 1952 ఎన్నికల్లో సీపీఐ విజయం

**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారిగా 1952లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాన్ని భారతీయ కమ్యూనిస్టు పార్టీ కైవసం చేసుకుంది. ఈ పార్టీ అభ్యర్థిగా బసవారెడ్డి శంకరయ్య పోటీ చేయగా.. ఆయనకు 25438 ఓట్లు రాగా ఆయన సమీప ప్రత్యర్థి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బి. శేషురెడ్డికి 9290 ఓట్లు రావడం జరిగింది. 1952లో కోవూరు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం ఓట్లు 69817 కాగా.. ఆ ఎన్నికల్లో 44422 మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిపై 9290 ఓట్ల మెజార్టీతో తొలి ఎన్నికల్లోనే కైవసం చేసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎం. యానాదయ్య పోటీ చేయగా.. ఆయనకు 1906 ఓట్లు, టి. రామకృష్ణకు 1363 ఓట్లు కె. రమణయ్యకు 1237 ఓట్లు , వి. సుబ్బయ్యకు 1084 ఓట్లు రావడం జరిగింది. 1952లో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో కోవూరు అసెంబ్లీ అభ్యర్థిగా మొట్టమొదటి వ్యక్తి భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన బి. శంకరయ్య.

## రాపూరు సిహెచ్‌సిలో వైద్యులను నియమించాలి

**రాపూరు, మే16 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించాలని తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ మైనారిటీ ఉపాధ్యాక్షుడు షేక్ ముక్తియర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించగా అందులో వైద్యులు కొరత వున్నట్లు గుర్తించామన్నారు. రాపూరు..చిట్వేలీ ఘాట్ రోడ్డు వున్నందున ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయిని, అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు పెద్ద ఎత్తున వచ్చే భక్తులు తరచూ ప్రమదాలకు గురైతున్నారన్నారు. వీరికి చికిత్స అందించేందుకు వైద్యులు ఎంతో అవసరమన్నారు. ఆసుపత్రిలో జనరల్ మెడిసన్,జనరల్ సర్జన్,ఫిడియాట్రిక్ సర్జన్,మరియు సాధారణ వైద్యులను వెంటనే నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చదువుతో పాటు క్రీడలలోను రాణించాలి

**రాపూరు, మే16 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని నెహ్రూ యువజన కేంద్ర సభ్యుడు వి.ప్రసాద్ తెలిపారు. రాపూరు గ్రంధాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిభిరాలలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రిడలలోను రాణించాలని తద్వారా నైపుణ్యత, శారీరక ఆరోగ్యం బావుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిణి,సహాయకుడు జె.ధనమ్మ, కె.వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## సొసైటీ ఉద్యోగి కుటుంబాన్ని పరామర్శించిన కొమ్మి



**చేజర్ల మే 16 ప్రభాతవార్త** చేజర్ల మండలం నాగులు వెలటూరు గ్రామానికి చెందిన పారా యానాదయ్య ఇటీవల గుండెపోటు మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ ఆత్మకూరు శాసనసభ్యులు,రాష్ట్ర టిడిపి ఉపాధ్యాక్షులు కొమ్మి లక్ష్యయ్యానాయుడు గురువారం నాలవెలటూరు గ్రామానికి వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగడాసానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిఇఒ రాగిపిండి గురవారెడ్డి, ఆయన వెంట టిడిపి నాయకులు మండల పార్టీ అద్యక్షులు రావి లక్ష్మీనరసారెడ్డి, మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులునాయుడు, కొమ్మి సిద్దుల నాయుడు, సొసైటీ అద్యక్షులు బోదళ్ళ వీరరాఘవరెడ్డి, కొమ్మి సుబ్బానాయుడు, కొమ్మిరమేష్‌నాయుడు, సోసైటీ సిబ్బంది పలువురు నాయకులు పాల్గోన్నారు.

## కోవూరుకు చేరిన పాఠ్య పుస్తకాలు



**డాక్యుమెంటు పోయినది**
మా తాలూకు జలదంకి మండలం, బ్రాహ్మణక్రాక గ్రామ సర్వే నెంబరు 1485/1A లోని 44 అంకణములకు సంబంధించి తేది 20.09.2001 న కావలి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో డాక్యుమెంటు నెం. 2547/2001గా రిజిస్టరు కాబడిన ఒరిజినల్ విక్రయ పత్రము తేది 16.04.2024 న మా ఇంటి నుండి జలదంకి బస్టాండు సెంటరులోని జెరాక్సు కు పోవుచుండగా పోయినది. దొరికినవారు తెలియజేయగలరు.
PARAPURATH SRIDEVI. సెల్: 9603972886

**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రానున్న విద్యా సంవత్సరానికి గానూ తొలి విడత 19868 పాఠ్య పుస్తకాలు గురువారం కోవూరుకు చేరుకున్నాయి. ఈ మేరకు వాటిని మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ ఆధ్వర్యంలో స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో భద్రపరిచారు. ఇప్పటికే ఒక లోడ్ నోటు పుస్తకాలు కూడా రావడం జరిగిందని, పాఠశాల తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు, నపోటు పుస్తకాలు ఇతర విద్యాకానుకలు పాఠశాలలకు పంపించేలా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.

## వృద్ధాప్య భారంతో వృద్ధుడు ఆత్మహత్య

**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం జమ్మిపాలెం గ్రామానికి చెందిన ఎం. పెంచలయ్య (65) ఒకవైపు వృద్ధాప్యం, మరోవైపు చేయి విరిగి బాధ పడుతుండడంతో అది తట్టుకోలేక బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ మేరకు అతనిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



**నివాళులర్పించిన మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి :** జమ్మిపాలెం గ్రామానికి చెందిన ఎం. పెంచలయ్య మృతదేహానికి అమెరికాలో నివాసం ఉంటున్న వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెంచలయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ సమయంలోనే గుండె దిటవు చేసుకుని ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు.

## చేజర్ల నివాళులు

**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జి. కృష్ణయ్య ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.కృష్ణయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సానుభూతి తెలియజేశారు. ఈ సమయంలో గుండె దిటవు చేసుకుని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చరు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకుమార్, మురళీకృష్ణారెడ్డి, విజయ్, తదితరులు ఉన్నారు.



## 6 నెలల చిన్నారి అకాల మృతి



**కోవూరు, మే 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గిరిజన కాలనీ ప్రాంతానికి చెందిన పాకం వెంకటేశ్వర్లు–మాధవిల ఆరు నెలల చిన్నారి పాప గురువారం మృతిచెందింది. ఈ మేరకు సమాచారం అందుకున్న ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బుధవారం యథావిధిగా ఈ చిన్నారికి వైద్య ఆరోగ్య సిబ్బంది 6 నెలల పాపకు ఇవ్వాల్సిన ఇంజక్షన్‌లను వేశారు. అప్పటి నుంచి రాత్రి వరకు చలాకిగా ఈ చిన్నారి ఆడుకుంది. గురువారం తెల్లవారుజామున మాధవి బిడ్డకు పాలిచ్చి అటు వెళ్లింది. తీరా 6 గంటల ప్రాంతంలో వచ్చి చూసే సరికి చిన్నారి మృతి చెంది ఉంది. వెంటనే వారు సమీపంలో ఉన్న వైద్య ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి పాప మృతిచెంది ఉంది. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డాక్టర్ నిరంజన్ బుధవారం ఈ పాపకు ఇచ్చిన ఇంజక్షన్‌ను అదే ప్రాంతంలో ఐదుగురికి కూడా వేయడం జరిగిందని, ఎవరికి ఎటువంటి కంప్లైంట్‌లు రాలేదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బియంఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



**బిట్రగుంట, మే 16 ప్రభాతవార్త :** బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని విశ్వనాధరావుపేట సర్పంచ్ గండూరు మంజుల పేర్కొన్నారు. పంచాయతీలోని ఇబ్రహీంపేటలో గురువారం యంకె హాలులో జరిగిన పేద ముస్లిం పిల్లలకు ఖత్నా అనంతరం ట్రస్ట్ సమకూర్చిన పోషకాహారాన్ని ఆమె పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో కంటి వైద్యశిబిరాలు, వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. కావలి మాజీ ఎయంసి చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఆర్థిక సహకారం ఎప్పుడు వుంటుందన్నారు. మైనార్టీ నేత షమీవుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ళ శ్రీనివాసకిరణ్, ముతహర్, సుజిత్,శ్రీకాంత్, ఫిరోజ్, డబ్బీర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మాకొద్దు ఈ సెల్ టవర్



నెల్లూరు రూరల్, మే 16, ప్రభాతవార్త నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ మాకొద్దు అంటూ రూరల్ నియోజకవర్గంలోని 37 వెంగళరావు నగర్ సిబ్లాక్‌లో గురువారం స్థానికులు ఆందోళనలకు దిగారు. మాకొద్దు ఈ సెల్ టవర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు సెల్ టవర్ ఏర్పాటు చేసి రేడియేషన్‌తో మా బతుకులు ఏం అవ్వాలంటూ వాళ్ళు ప్రశ్నించారు. గత నాలుగు రోజులుగా ఎయిర్టెల్ కంపెనీ వారు ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను స్థానిక ప్రజలు అడ్డుపడుతున్నారు. 600 మంది విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వం పట్టించుకోకుండా ఇలాంటి సెల్ టరవ్ ఏలా ఏర్పాటు చేస్తారంటూ స్థానికులు కాలనీలో నిరసన చేపట్టారు. వీరికి మద్దతుగా వైసిపి 33వ డివిజన్ ఇంచార్జ్ మేఘన సింగ్ వారికి అండగా నిలిచారు. పేదలు నివసించే ఏరియాలో ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మించడాన్ని ఆయన తప్పు పట్టారు. వెంటనే నిర్మాణ పనులు ఆపివేయాలంటూ ఆయన తెలిపారు. దీనిపై వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి పేదల ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, దయాకర్, శివ, మోషే, దాస్, అనిల్, స్థానిక మహిళలు తదితరులు ఎత్తున పాల్గొన్నారు.